15.

# పవిత్ర స్త్రీశక్తే భారతదేశమునకు రక్ష

గతజీవుడగు పతిన్ బ్రతికించుకున్నట్టి
సావిత్రి భారత సతియె కాదె!
తన సత్య మహిమచే దావాగ్ని చల్లార్చె
చంద్రమతి పవిత్ర చరిత కాదె!
కులసతీత్వమునకై గుండాన దూకిన
సీత భారత ధరాజాత కాదె!
కినిసి దుర్మద కిరాతుని బూది గావించె
దమయంతి భారత రమణి కాదె!
సప్త సాగర పరివేష్టితోర్వితలము
భరత జాతి పాతివ్రత్య ప్రవిమలంబు
భావసంపదకిది మహా పంట భూమి
అఖిల దేశాలకిది ఉపాధ్యాయి కాదె!

## గాయత్రియే వేదమాత

ప్రేమస్వరూపులారా!

భారతదేశమునందు పవిత్రమైనటువంటి స్త్రీ శక్తి అనేటువంటిదానిచే అనంతకాలమునుండి భారతదేశము రక్షింపబడుతూ వచ్చింది. భారతీయుల వాంఙ్మయమైన వేదములు గాయత్రి బిడ్డలే. 'గాయత్రీం ఛందసాం మాత' వేదములకు తల్లి గాయత్రి. గాయత్రి సర్వత్రా వ్యాపించినట్టి శక్తి. భారతదేశమునందే కాక ఇతర దేశములందు కూడను ఈ శక్తి సర్వవ్యాపకమై, సర్వాంతర్యామియై, సర్వభూతాంతరాత్మయై ప్రకాశిస్తూ ఉంటున్నది. వివిధ దేశములందు ఈ గాయత్రికి వివిధనామములు ఏర్పరచి ఆ నామములచేత ఆయా దేశము వారు ప్రార్థిస్తూ, ఆ దేశముయొక్క అనుగ్రహానికి గురి అవుతూ వచ్చారు. భారతీయులు ఈ గాయత్రిని అనేక పేర్లతో, రూపములతో ఆరాధిస్తూ,

sri sathyasaivachanamrutam

ఆనందిస్తూ తమ జీవితములను సార్థకము గావించుకుంటూ వచ్చారు. సత్యవతి, అంగవతి, అన్యవతి, నిదానవతి, అనేటువంటి పవిత్రమైనటువంటి నామములను వారు ఏర్పరచుకొని ఆ నామస్వరూపముచేతనే తమయొక్క జీవితము సార్థకము గావించుకుంటూ వచ్చారు ప్రాచీనులు.

సత్యవతి అనగా - పాలయందు ఒక్కొక్క బిందువునందు కూడను వెన్న ఉంటున్నది. పాలయందు ఏ భాగములో చూచినప్పటికిని ఈ వెన్న తాను సాక్షాత్కరిస్తూ వస్తుంది. అటులనే ఈ ప్రపంచము అనేటువంటి భాండమునందు ఉన్నటువంటి జీవరాశులయందు ఒకొక్క జీవరాశియందు కూడను దైవత్వము అనేటువంటి ఆత్మతత్త్వము వెన్న రూపము ధరించి ఉన్నదని ఆనాటి వారి విశ్వాసము. ఏ జీవియందు కూడను ఆత్మతత్త్వము లేకుండా ఉండటానికి వీలులేదు. సర్వభూతాంతరాత్మ అనేటువంటి సార్థకనామాన్ని తాను అందుకుంది. అన్ని జీవులయందు ఉండినటువంటి ఆత్మతత్త్వము ఒక్కటే అని నిరూపిస్తూ వచ్చింది. 'ఏకం సత్ విప్రా బహుధా వదన్తి' ఉన్నది ఒక్కటే అయినప్పటికిని అనేకమంది అనేక పేర్లతో దేవుని అనుభవిస్తూ వచ్చారు.

అన్యవతి - అనగా పంచభూత స్వరూపమైనటువంటి దివ్యత్వమే. శబ్ద, స్పర్శ, రూప, రస, గంధములు. ఈ పంచభూతములు కోటీశ్వరుని మొదలుకొని కూటి పేదవరకు సర్వజీవులయందు కూడను సమత్వంగానే ప్రకాశిస్తూ ఉంటున్నవి. ఈ పంచభూతములు లేనటువంటి జీవితము జగత్తులో కాన రాదు. ఏ దేశమునందైనా, ఏ కాలమునందైనా పంచభూతములే ప్రధానమైనటువంటి ప్రాణములు. కాన సమస్త ప్రపంచమునకు కూడను ఈ పంచభూతస్వరూపమే అన్యవతి అనేటువంటి పేరుతో ఆరాధిస్తూ వచ్చారు.

అంగవతి - ఈ అంగవతికి ఆకారమునకు ఒక్కొక్క చిహ్నమును గుర్తింప చేస్తూ వచ్చింది. ఈశ్వరుడు అనగా అతనికి త్రిశూలధారి అని, ముక్కంటి అని అనేక విధములుగా కొన్ని గుర్తులుగా చెప్పారు. ముక్కంటి అనేటువంటి వాడు, త్రిశూలధారి అనేటువంటి వాడు, ఢమరుకము చేపట్టినటువంటి వాడు ఈశ్వరుడని ప్రత్యేకమైన కొన్ని గుర్తులను ఏర్పరిచి బోధిస్తూ వచ్చింది. విష్ణువు అనగా శంఖ, చక్ర, గదాదారి అయినటువంటివాడు, అలంకార స్వరూపుడు అనేటువంటి తత్త్వాన్నికూడను నిరూపిస్తూ, బోధిస్తూ వచ్చింది ఈ

srisathyasaivachanamrutam

అంగవతి. సరస్వతి అనగా వీణాపాణి. 'సరస్వతి భగవతి భారతి పూర్ణేందు బింబానన'. ఈమె సర్వశక్తిమయమైనటువంటిది. తన హస్తమునందు వేణును ధరించి అనగా వీణను ధరించి ఆ వీణనాదమే బ్రహ్మనాదంగా భావిస్తూ ఉండమని ప్రబోధిస్తూ వచ్చింది. గణపతి అనగా గజముఖమును ధరించి, పెద్ద బొజ్జచేత తాను ఆరాధ్య దైవముగా నిల్చుతూ వచ్చాడు. ఏ శుభకార్యములు చేయవలసివచ్చినప్పటికిని, ఏ పవిత్రమైన కార్యమును చేయవలసివచ్చినప్పటికిని మొట్టమొదట గణపతిని పూజించడం, తదుపరి యే ఇతర దేవతలను ఆరాధించటం జరుగుతూ వచ్చింది. ఇట్టి కొన్ని రకములైనటువంటి నియమనిష్ఠలను మాత్రమే నియమింప చేసినటువంటిది, ఈ అంగవతి.

నిదానవతి - ఈ నిదానవతియొక్క ప్రబోధలు శ్రవణం, కీర్తనం, విష్ణుస్మరణం, పాదసేవనం, వందనం, అర్చనం, దాస్యం, స్నేహం, ఆత్మనివేదనం. ఈ నవవిధ మార్గములయందు దైవమును ఆరాధించి జీవితము సార్థకము గావించుకొమ్మని ప్రబోధించేటువంటిదే నిదానవతి. అన్యవతి, అంగవతి, సత్యవతి, నిదానవతి ఈ నాలుగు దేవతలయొక్క స్వరూపమే జగత్‌స్వరూపము. దీనిని పురస్కరించుకొని ప్రకృతికి స్త్రీ అని పేరు పెడుతూ వచ్చారు. ఏ దేశము వారైనా కాని మాతృభూమి అంటారు కాని పితృభూమి అని చెప్పరు. మదర్‌లేండ్ ఈ మదర్‌కి ఇచ్చినటువంటి ప్రాముఖ్యత ఇంత దృఢమైదిగా ఉంటున్నాది. ఇంతియే కాదు. దైవాత్మ స్వరూపమైనటువంటి విష్ణువుకు గాని, ఈశ్వరునికి గాని, కృష్ణునికి గాని అందరికి కూడను స్త్రీ మొదలు, పురుషుడు తరువాత. లక్ష్మీనారాయణ, నారాయణలక్ష్మీ అని ఎవరూ పిలవరు కదా! ఎక్కడైనా కాని పురుషులకు ప్రథమస్థానము ఇవ్వలేదు. మొట్టమొదట స్త్రీకే ప్రధానమైనటువంటి స్థానమిచ్చారు. ఇంక ఈశ్వరునియందు కూడను పార్వతీపరమేశ్వరులు అంటారు, పరమేశ్వరపార్వతీ అని ఎవ్వరూ చేప్పరు. అదేవిధముగానే రాధాకృష్ణ, రాధ అనగా ఎవరు? ఏదో ఒక పరమ భక్తురాలు కాదు. రాధ, దానిని త్రిప్పి చదివినప్పుడు ధరా, ఇది ప్రకృతి. అనగా ఈ లక్ష్మీ, పార్వతి, రాధ వీరందరూ కూడను స్త్రీ రూపమును ధరించినటువంటి ప్రకృతి స్వరూపులే. కనుక స్త్రీయొక్క ప్రాధాన్యత ఈనాటికైన భారతీయులు గుర్తించి, స్త్రీలు కేవలము అబలలు కారని, సబలలు అని గుర్తించుట అత్యవసరము. ఏ గృహమైనకూడను అభివృద్ధికి



srisathyasaivachanamrutam

రావలెనన్నను, కీర్తిని పొందవలెనన్ననూ, సార్థకత సాధించవలెనన్ననూ స్త్రీయే ముఖ్య కారణము. కనుక ఇట్టి గృహమునకే కాక, దేశమునకే కాక విశ్వమునకే ఒక ఆధార దేవత అయినటువంటిదే స్త్రీ రూపము. ప్రాచీన కాలమునుండి ఈ భారతదేశమునందు ఇలాంటి పవిత్రమైనటువంటి ఆచారములు అలవరుచుకుంటూ వచ్చారు. ఈ గృహమునకు ఆమెకు గృహలక్ష్మి అని పేరు పెట్టారు. అనగా గృహమునందు ఎన్ని విచారములు, ఎన్ని కష్టములు, ఎన్ని బాధలు ఉండినప్పటికిని నవ్వుకుంటూ ఆనందంగా ఈ గృహముయొక్క కీర్తిని నిలబెట్టే నిమిత్తమై తన జీవితాన్ని త్యాగము చేసేటటువంటి వారు స్త్రీలు.

## స్త్రీలయందున్న వివిధ శక్తులను గుర్తించాలి

స్త్రీలయందు ఏడు విధములైనటువంటి శక్తులు ఉంటున్నాయి. సత్యము, ప్రేమ, ధర్మము, త్యాగము, సహనము, సానుభూతి, ఆనందము. ఈ ఏడు శక్తులుకూడను కూడినటువంటిదే ఈ స్త్రీ. ఈ స్త్రీ వలననే గృహముకాని, వ్యక్తులుకాని, సంతానము కాని దేశ వ్యాప్తి కావడానికి, సత్కీర్తిని తేవడానికి, ఆనందాన్ని అందించడానికి, శాంతి భద్రతలను చేకూర్చుడానికి ఈ స్త్రీయే మూలకారణము. కనుక భారతీయులు ఇల్లు చూచి ఇల్లాలిని చూడు. ఈ గృహము అనేటువంటిది ఒక ప్రతిష్ఠ స్థానమైనటువంటి దేవాలయము. కనుకనే సత్ శీలవంతురాలు. అట్టి పవిత్రమైనటువంటి హృదయాన్ని గుర్తించినట్టి మహర్షి కాబట్టి మాతంగుడు ఆమెకు అవకాశము ఇచ్చాడు. స్త్రీలయొక్క పవిత్రతను గుర్తించుకోవడానికి కూడను ఒక ప్రాప్తి ఉండాలి. కాని ఈ కలియుగ ప్రభావముచేత, చదువుసంధ్యలచేత, కేవలము స్త్రీలంటే ఒక ఆట బొమ్మలుగా వారు భావిస్తూ ఉన్నారు. కాదు, కాదు, దేశమును ఉద్ధరించేటువంటివారు, దేశమునకు ఆదర్శాన్ని అందించేటువంటివారు, దేశముయొక్క మంగళకరమైనటువంటి గుణగణములు ప్రకటించేటువంటి వారు వీరే. ఈ సత్యాన్ని వారు (పురుషులు) గుర్తించుకోవటానికి ప్రయత్నించటంలేదు. గుర్తించినప్పటికిని వారు ఏమాత్రము కూడ దానిని లక్ష్యము చేయుటలేదు. ఇదే పురుషులయొక్క అలక్ష్యము. కేవలము స్త్రీలను ఒక వంటవారిగా, వంటింటి అధికారిగా భావించుకుని, అనుభవించుకుని ఈ సంతోషాన్ని అనుభవిస్తూ కేవలము స్త్రీలయొక్క శక్తిసామర్థ్యాలని మర్చిపోతూ వచ్చారు. ఆ స్త్రీ వంటగదిలో ఉండటానికి మూలకారణం ఏమిటి? ఇల్లాలు. ఆ పేరుకు తగినటువంటి

sri sathyasai vachanamrutam

సార్థకతను సాధించే నిమిత్తమై ఆ ఇంటిలో వంటలనంతా వండుకుని పతికి, పిల్లలకు సరియైనటువంటి ఆరోగ్య, ఆనందములను అందించే నిమిత్తమై పవిత్రమైనటువంటి ఆహారాన్ని ఆవిర్భవింపచేస్తూ వచ్చారు. నేడు, నిన్న వచ్చినటువంటివి పద్మశ్రీ, పద్మవిభూషణలగు బిరుదులు. ప్రాచీన కాలమునందు ఒక్క స్త్రీలకు మాత్రమే ఈ పవిత్రమైనటువంటి బిరుదులంతా అందిస్తూ వచ్చారు. ఇల్లాలు, గృహలక్ష్మి, ధర్మపత్ని, అర్థాంగి ఇటువంటి బిరుదులు ఎవరికి వచ్చినాయి? కనుక వారు చేసేటువంటి ఆచరణను వారి బావములను, వారి త్యాగములను, వారి గుణగణములను కూడ ఆదర్శం చేసుకొని వీరికి ఇన్ని బిరుదులు అందించారు. కాని ఈ కలి ప్రభావముచేత

**ఉద్యోగములు చేయ నువిదలందరు బోవ**
**గృహకృత్యములు తీర్చు గృహిణులెవరు?**
**ఆలుమగ లిరువురు ఆఫీసులకు బోవ**
**ఇంటిలోనుండెడి ఇంతులెవరు?**
**పరబాలురకు నేర్ప పాఠశాలల కేగ**
**తమ బాలురకు నేర్పు తల్లులెవరు?**
**పుస్తకాల్ చేపట్టి పురుషులవలె బోవ**
**వంటయింటిని దిద్దు వనితలెవరు?**
**డబ్బులేనియట్టి యిబ్బంది తీరిన**
**ఇంటిలోని కొరత ఎంతయుండు**
**సుఖము చూడబోవ సున్నయే ఉద్యోగ**
**పదవియందునున్న పడతి కెపుడు.**

కేవలము డబ్బు కోసం పాటు పడుతున్నారే గాని గృహముయొక్క పేరుప్రతిష్ఠలకోసం ఎవ్వరూ పాటు పడుటలేదు. స్త్రీలు తప్పక చదువవలసిందే. చదువుకోవాలి, ఆ చదివినటువంటి చదువును ఆచరణలో పెట్టాలి. ఆచరణలో పెట్టినటువంటిదానిని ఇతరులకు అందించడానికి ప్రయత్నం చేయాలి. వీళ్ళు చదువకూడదు అని, వీళ్ళు అధికారులు కాకూడదు అని, వీరు ఆఫీసులకు పోకూడదు అని ఈ విధములైనటువంటి

srisathyasaivachanamrutam

నిబంధనలు కేవలము స్వార్థముతో నియమించినటువంటివి. ప్రపంచాన్ని పరిపాలించటానికి కావలసిన శాంతి భద్రతలు స్త్రీలయందే ఎక్కువగా ఉంటున్నాయి. ఈ త్యాగ భావము, ప్రేమ భావములు వారిలో ఉట్టిపడుతూ ఉంటాయి. ఏదో సమయం సందర్భాన్ని పురస్కరించుకొని కొంచెము క్రోధము రావచ్చును, అవి తాత్కాలికము అయినటువంటివే కాని హృదయమునుంచి ఆవిర్భవించి నటువంటివి కాదు. స్త్రీ పురుషులకు ఇద్దరికీ కూడను తగినటువంటి గుణములు ఉండినప్పటికిని, కాని స్త్రీలయందు ఉత్తమ గుణములు, ఆదర్శ గుణములు, ఆనంద గుణములు అధికంగా ఉంటాయి.

**ప్రతినెల 19వ తేది మహిళా దినోత్సవం**

సావిత్రి పవిత్రమైనటువంటి చరిత్రను మనము విచారించినప్పుడు గత జీవుడైనటువంటి పతిని బ్రతికించుకోటానికి, సర్వ విధములుగా యమునితో కూడను యుద్ధము చేసి ఆ భర్త ప్రాణాన్ని తిరిగి పొందింది. కాని, పురుషులయందు ఎవ్వరైనా, ఒక్కరైన కూడను గతించినటువంటి సతిని బ్రతికించుకోవాటానికి ప్రయత్నం చేసినట్లు చరిత్రలో ఎక్కడ కనిపించ లేదు. సతి మరణించిన తక్షణమే రెండవ వివాహానికి సిద్ధంగా ఉంటారు. కాని సతులు ఆ విధంగా కాదు. ఈ ఆధునిక యుగములోపల ఈ వికారమైనటువంటి భావములు అభివృద్ధి అయిపోయి వారికి విరుద్ధమైన మార్గములతో స్త్రీలకు అన్ని ఇక్కట్లు కలిగిస్తూ వస్తున్నారు. కనుక పవిత్రమైన ఇట్టి మన ప్రాచీన ధర్మమును, సంస్కృతిని నిలబెట్టే నిమిత్తమై, ప్రతి నెల 19వ తేది స్త్రీలయొక్క దినముగా ఏర్పరుస్తూ వచ్చారు. కాని కేవలము నియమించటమే కాదు చాలామంది స్త్రీలు దీనిని అనుసరించి, ఆనందించి దీనికి తగినటువంటి ఉత్సాహప్రోత్సాహములు అందిస్తూ వచ్చారు. అనేకమంది ఈ రంగములో పాల్గొంటున్నారు. ఈ విధమైనటవంటి అభివృద్ధి అయినప్పుడు భారతదేశము అన్నిటికినీ ఆదర్శవంతమైన దేశంగా రూపొందుతుంది. ఈ ధర్మము, సంస్కృతి, పవిత్రమైనటువంటి న్యాయము, ఆదర్శము స్త్రీల వలననే అభివృద్ధి కావాలి కాని పురుషులచేత కావడానికి అవకాశము లేదు. ప్రాచీన సంస్కృతికి ఈ స్త్రీలే వారసులు. కారణమేమనగా, ప్రాచీన కాలమునుండి స్త్రీలు అనేకమైనటువంటి దేశోద్ధారణకోసమై పాటు పడేందుకు కంకణం కట్టుకున్నారు. గీతారెడ్డి

srisathyasaivachanamrutam

చెప్పింది, మహా పతివ్రతలందరూ ఎంతగానో ఆదర్శాన్ని నిరూపించారు, ఝూన్సిరాణి ఎంతో ఘోరమైన యుద్ధము చేసింది. కడపటికి తన ప్రాణమునైనా తీసుకుంది కాని, ఆ అపకీర్తికి ఏమాత్రము గురికాలేదు. కనుకనే వారిలో త్యాగమునకు గొప్ప స్థానము ఉంది. వేదము కూడా అదే బోధిస్తూ వచ్చింది. 'నకర్మణా నప్రజయా ధనేన త్యాగేనైకే అమృతత్వమానశుః'. ఆ త్యాగములోపల అమృత బిందువులు ఈ స్త్రీలు. ఏదో యుగప్రభావముచేత కొంతమంది అటూ ఇటూ ఉండవచ్చును కాని, త్యాగానికి స్థానము అయినటువంటి వారు స్త్రీలు. సమయసందర్భాన్ని పురస్కరించుకొని, స్థాన బలమును పురస్కరించుకొని వారు కొంతవరకు మారవలసి వచ్చింది. ఎందుకంటే వారికి తగినటువంటి ప్రోత్సాహ, ఉత్సాహములు లేకపోతున్నాయి. ఎవరైనా ఒక స్త్రీ ముందుకు వచ్చి ఏదైనా ఒక కార్యములో పాల్గొనాలంటే దానికి అనేక అడ్డులు తగులుతున్నాయి. బయట సమాజములోనే కాదు, ఇంటిలోనే దాని అభ్యంతరాలు ప్రారంభమవుతున్నాయి. ఇంక ఆ స్త్రీలు ఏమి చేయగలరు? ప్రతి ఇంటిలో కూడా స్త్రీలకు తగినటువంటి ఉత్సాహ, ప్రోత్సాహములు ఇచ్చి వారిని ముందంజ వేయించాలి. ఇది కేవలము గృహములకు మాత్రమే కాదు, సమాజమునకు మాత్రమే కాదు, దేశమునకు మాత్రమే కాదు విశ్వానికి ఆదర్శవంతమైనటువంటి కార్యములను స్త్రీలు చేకూర్చగలరు. ఏదో కొంతమంది ఈ కార్యములో కొంచెము సరియైనటుంవటి గుణము లేనటువంటి వారు ఉండవచ్చును. కాని అదంతా మనము లెక్క చేయకూడదు. Pleasure is an interval between two pains. మంచిలోపలనే ఒక చెడ్డ ఉంటుంది, ఈ చెడ్డ లేకుండా మంచి జరగడానికి వీలు కాదు. ఒక కమలాపండు ఉన్నది. దానిలోపల తీయని రసము ఉండినప్పటికిని దానిపైన చేదు చర్మము ఉంటుండాది. అయితే ఆ చేదు చర్మము తీసి పారవేయాలి. మధురమైన రసాన్ని గ్రోలాలి. మానవ వృక్షమునందు, జీవిత వృక్షమునందు కూడా ఈ విధమైన పవిత్రమైన, శాంతి అనే ఫలములు ఉన్నాయి. ఆ శాంతి మనము అనుభవించాలంటే ఆ ఫలముపైన ఉన్నటువంటి చెడ్డను మనము తీసివేయాలి. దానికి మధ్యలో ఉన్నటువంటి దుర్గుణములు అనేటువంటి విత్తనములు కూడను తీసిపారవేయాలి. అప్పుడే మధురమైన రసాన్ని మనము ఆరగించడానికి వీలవుతుంది. కనుకనే వేదమునందు 'రసో వైసః' రసముతో కూడినటువంటి హృదయాలు మానవునియొక్క హృదయాలు. అందులో త్యాగ రసము, సత్య రసము, ధర్మ రసము

sri sathyasai vachanamrutam

స్త్రీలయందు అధికంగా ఉంటాయి. వారియందు ఉన్నటువంటి పవిత్రమైన గుణములను ఏ పురుషుడు ఉత్సాహ ప్రోత్సాహముతో అభివృద్ధి గావించునో, ఆ పురుషుడు తగిన అభివృద్ధిని పొందుతాడు. ఆడవారు అంటే ఏమీ పనికిరాని వారుగా భావిస్తున్నారు. మేము పురుషులము, పురుషలక్షణము ఏమని, ఉద్యోగము పురుషలక్షణము అని విఱ్ఱవీగుతున్నారు. ఎంతమంది స్త్రీలు ఉద్యోగము చేసేటువంటి వారు లేరు? వారు స్త్రీలు కారా? ఎంతమంది ఉద్యోగము లేనటువంటి పురుషులు లేరు? ఎంతమంది ఉద్యోగము చేసేటువంటి స్త్రీలు లేరు? ఇప్పుడు న్యాయంగా చూస్తే విచారణ చేస్తే పురుషులకంటే స్త్రీలే ఎక్కువమంది ఉద్యోగములు చేస్తున్నారు. మొన్న దేనికో నేను అక్కడ ITI కు వెళ్ళినపుడు డైరెక్టరు వచ్చాడు. యీ టెలిఫోన్ ఫేక్టరీలో ఎంతమంది ఉంటున్నారు ఆడవారు అన్నాను. స్వామీ! 99% ఆడవారే అన్నాడు. ఎందుకు మీరు మగవారిని తీసుకోలేదని ప్రశ్నించాను. కాని స్వామి మగవారు చేసేటువంటి పనిలోపల పదింతలు ఆడవారు చేస్తుంటారు. పనిలోపల ప్రవేశించినారంటే ఆడవారికి అదొక దీక్ష. అది పూర్తి అయ్యేంతవరకు కూడను ఏమాత్రము పట్టు వదలరు. ఆ కర్మ దీక్ష అనేటువంటిది వాళ్ళయందే వుంటున్నాది. కనుకనే ఆ పని వారికే తగినటువంటి శక్తి. కనుక పురుషుడు ఉద్యోగం చెయ్యాలి. స్త్రీలు వంటలు చెయ్యాలి అని ఏ శాస్త్రము చెప్పటము లేదు. ఒక్కొక్క సమయములో పురుషులు కూడా వంటవారుగా ఉంటారు. ప్రస్తుతం మగ వంటవారు ఎక్కువగా ఉంటున్నారు. కనుక వంట అనేది ఒకరి హక్కు, ఇంక ఉద్యోగం ఇంకొకరి హక్కు అని విభజించటానికి వీలులేదు. సమయ సందర్భాన్ని పురస్కరించుకొని స్త్రీలు కూడా ఉద్యోగం చేయవచ్చును. పురుషులు కూడను ఉద్యోగం చేయవచ్చును లేక స్త్రీలు కూడను వంటలు చేయవచ్చును. పురుషులు కూడను వంట చేయవచ్చును. Awareness is life అనగా అన్ని విషయములయొక్క పనులు తెలిసి ఉండాలి. ఈ పని వీరిది, ఆ పని వారిది అని నిర్ణయించే అధికారం ఎవరికీ లేదు. కనుక అన్ని పనులు కూడను మనము నేర్చుకోవలసిందే. ఆ ఉత్సాహ, ప్రోత్సాహము ఒక్క స్త్రీలయందు మాత్రమే అధికంగా కనిపిస్తుంది. Awareness అంటే understand చేసుకోవడం అనుకుంటున్నారు. Understanding ఎంతవరకు చేసుకోవటం? ఏదో కొద్దిగా understand చేసుకుంటే అది understand కాదు. ఇది ఏమిటి అని అడిగినప్పుడు, piece of cloth అంటారు. ఇది ఏమిటి అన్నప్పుడు ఇది hand kerchief

sri sathyasai vahini

అంటారు. అనగా పరిపూర్ణమైనటువంటి understanding నిజమైనటువంటి Awareness. ఇంతో అంతో తెలిసిన తరువాత అది Awareness అని చెప్పటానికి లేదు. మానవుడిగా పుట్టినందుకు అన్నీ నేర్చుకోవాలి. ఏ పని ఎప్పుడు ఏ వ్యక్తికి అవసరమౌతుందో చెప్పడానికి వీలులేదు. కనుక అందరియందు ఈ శ్రద్ధ ఉండాలి. స్త్రీలు అబల లని, వారు పనికిరాని వారని వారిని వెనుకంజ వేయటం మంచిది కాదు. వారికి కూడను ఉత్సాహ ప్రోత్సాహాలు అందించాలి. వారియందు కూడను దివ్యశక్తులు ఎన్నో ఉన్నాయి. అజ్ఞాత శక్తులు ఎన్నియో ఉన్నాయి. ఎవరికీ కనిపించనటువంటి శక్తులు ఎన్నియో ఉన్నాయి. నిజంగా చూస్తే వారు అబలలు కారు మహాబలులు. ఒక చిన్న ఉదాహరణము. సైన్యములో Commander-in-chief పెద్ద అధికారి. అతను వస్తున్నాడంటే సిపాయిలందరు కూడను అదరిపోతారు. కాని ఇంటికి వచ్చి భార్యను చూసేటప్పటికి ఈ Commander-in-chief కూడ వణికిపోతాడు. ఎందుకింత భయము? పురుషులయందు ఈ దోషము ఉండటము చేతనే స్త్రీలను చూచి భయపడుతున్నారు. ఒక హెడ్‌మాష్టరు వుంటున్నాడు, ఒక ప్రిన్సిపాల్ వుంటున్నాడు. కాలేజీ పిల్లలందరు వీరిని చూడగానే చాలా భయంగా, వినయంగా ప్రకటిస్తారు. ఇంత భయపెట్టినటువంటి ప్రిన్సిపాల్ ఇంటికి వచ్చేసరికి 'ఎందుకండి మీరు అర్ధగంట ఆలస్యంగా వచ్చారు?' అనేటప్పటికి తాను భయపడిపోతాడు. ఇది ఈనాటి పురుషులయొక్క నైజము అయిపోయింది. Nature of life. అది వీరిలో ఇంత బలహీనత ఉండకూడదు. వీరు కూడను పురుషులు అని పేరు పెట్టుకున్నందుకు బలమును ప్రకటించాలి.

**పురుషుడంటే-ఆత్మ. స్త్రీ పురుష భేదం లేదు**

పురుష అనగా ఏమిటి? ఒక మగవానికి మాత్రమే పేరు పొందినటువంటిది కాదు. పురుష అనగా ఏమి? చైతన్యమునకే పురుషుడు అని ఆత్మ అని పేరు. కనుక పురుషార్థములు అంటారు. పురుషార్థములు అనగా ఏమి? ధర్మ, అర్థ, కామ, మోక్షములు. ఈ నాలుగింటియందు అతనికి అధికారము ఉంటుంది అని అది సరియైన అర్థము కాదు. ఈ నాలుగు శక్తులను పొందడానికి స్త్రీలకు కూడను హక్కు ఉన్నది. పురుష అనేటువంటి దానికి కేవలము ఆకారమునుబట్టి ఉపాధి బట్టి పేరు పెట్టినటువంటిది కాదు. ఉపాధి అనేటువంటి పురమునందు నఖశిఖపర్యంతం సంచరించేటటువంటివాడే పురుషుడు. అది అందరియందు

srisathyasaivahini.org

ఉంటుందాది. కాబట్టి ఈ భేదమునకు వస్తే స్త్రీలుకూడా పురుషులే. ఈ పురుషత్వము అనేటువంటి చైతన్యము సర్వులయందు కూడను ఉంటుంది. కాని ఆ సత్యాన్ని గుర్తించేటువంటి స్త్రీలు దీనిని అనుభవిస్తున్నారు. వారు fundamental దీనిని ఆధారం చేసుకున్నారు. కాని పురుషులు కేవలం భౌతికమైన దేహాన్ని ఆధారం చేసుకున్నారు. పురుషుడు అనగా నేను ప్యాంటు, షర్టు వేసుకుంటే చాలు పురుషుడు అనుకుంటున్నారు. కాని స్త్రీలు కూడను ప్యాంటు, షర్టు వేసుకుంటున్నారు. ఆ డ్రెస్ వేసుకున్నంత మాత్రాన వారు పురుషులు అవుతారా? కాదు, కాదు, దివ్యత్వముతో కూడినటువంటి వాడే పురుషుడు. ఈ స్త్రీల వలననే ఇంకా భవిష్యత్తులో ఒక ధర్మస్థాపన జరగటానికి అవకాశం ఉంటుంది. కేవలము ఇది స్త్రీలకు మాత్రమే హక్కు అనుకోకండి. పురుషులకు కూడను దీంట్లో హక్కు ఉంటుంది. స్త్రీలకు కూడను దానికి తగినటువంటి ఉత్సాహ, ప్రోత్సాహాలు ఇచ్చి, మీరు కూడను ఆ కార్యక్రమములో పాల్గొన్నారంటే దేశము నిత్య కళ్యాణం పచ్చతోరణంగా రూపొందుతుంది. ఒకవేళ మీరు దీనికి ప్రోత్సాహ, ఉత్సాహములు ఇవ్వకపోయినప్పటికిని వాళ్ళకు అడ్డుతగలకుండా ఉండటమే, అదే ఒక గొప్ప ఉపకారం.

**అనన్య భక్తి గల వారికే భగవదనుగ్రహం**

కనుక మనము ఒక రాజకీయమునందు కాని, భౌతికరంగమునందు కాని, ఇంకేవిధమైనటువంటి ఆర్థికరంగమునందు కాని మనము ఏమాత్రము బేధము పెట్టుకోకూడదు. నైతిక, భౌతిక, ధార్మిక, ఆధ్యాత్మిక రంగములందు కూడను బేధము లేనటువంటి యొక్క సౌభ్రాతృత్వాన్ని మనం పొందాలి. ఇది దైవముయొక్క నిర్ణయము. ఏమని చెప్పారు? ఏ మానవుడైనా సరే వానికి నేను అధికారమిస్తున్నాను. ఏ విధమైన అధికారము? 'మోక్షయిష్యామి మా శుచః'. ఏ మానవుడు అయినా కాని. 'అనన్యాశ్చిన్తయన్తోమాం యే జనాః పర్యుపాసతే' అన్నాడు. ఈ జన్మమే ఆ జన్మమే కాదు ఏ జన్మమైనా సరే 'పర్యుపాసతే'. పదములయందే మనము అర్థాన్ని తీసుకోవచ్చును. 'యే జనాః పర్యుపాసతే, తేషాం నిత్యాభియుక్తానాం యోగక్షేమం వహామ్యహం' అట్టి వానియొక్క పరిస్థితులు నేను చూచుకుంటాను అన్నాడు శ్రీకృష్ణుడు. 'అనన్య భక్తి' కేవలము నాకు మాత్రమే సంబంధించినది, నా కుటుంబానికి మాత్రమే సంబంధించినది అని



srisathyasaivahini.org

అనుకున్నప్పుడు ఇది సామాన్యమైనటువంటి భక్తిగా ఉంటుంది. నేనూ బాగుండాలి, సమాజము బాగుండాలి అనేటువంటి రెండింటి భావముచేత ఆరాధన చేసేటటువంటి వారికి మధ్యమస్థానము అన్నారు. సర్వజీవులూ ఒక్కటే, సమస్త ప్రాణులూ ఒక్కటే అనేటువంటి ఏకత్వాన్ని గుర్తించి తెలుసుకున్నటువంటి వాడే అనన్య భక్తుడు. అనన్యభక్తి అంటే సర్వదా సర్వకాలేషు సర్వత్ర హరిచింతనము అనేటువంటిది కాదు. అదికాదు అనన్యభక్తి. అనన్యము అనగా ఇతర భేదములు లేకుండా అందరినీ సమత్వముగా భావించి చూడటము, అనుభవించటమే ఇది అనన్యభక్తి. సర్వ మానవులయందు దైవత్వము ఉంటుంది. సర్వ మానవులూ దైవస్వరూపులే. దేవుడు అంటే ఎక్కడో ఒక క్షేత్రములో ఉన్నాడు అని కాదు. దేవుడు ఏదో ఒక ప్రదేశములో ఉన్నాడు అని మనము అన్వేషణ చేయకూడదు. సర్వత్రా ఉండేటువంటి వాడే దేవుడు. ఇంత విశాలమైన దేవుడిని ఇంత చిన్న ఫొటోలో ఫ్రేమ్ కట్టుకుని పూజలో పెట్టుకుంటే భగవంతునికి ఎంత అవమానం చేసినట్టు అవుతుంది. అది నీయొక్క భావాన్ని అభివృద్ధి పరచుకోవటానికి నీ ప్రేమను అతనికి చెప్పుకోవటానికి ఆ ఫొటోని పెట్టుకున్నావు కాని ఆ ఫొటో మాత్రమే కాదు భగవంతుడు. ఆ విగ్రహము మాత్రమే కాదు భగవంతుడు. ఆ లాకెట్ మాత్రమే కాదు భగవంతుడు. సర్వత్రా నిండినటువంటివాడు భగవంతుడు. అండ పిండ బ్రహ్మాండమంతా కూడ నిండినటువంటి దైవత్వమే నిజమైనటువంటి దైవత్వము. కనుక దైవత్వము సర్వ వ్యాపకత్వము. ఈ యొక్క సత్యాన్ని మనము గుర్తించినప్పుడు సర్వభూతములు కూడను భగవత్ స్వరూపములుగానే బోధపడుతుంది. కనుక 'సర్వభూత నమస్కారం కేశవం ప్రతిగచ్ఛతి'. ఎవరికి మనము నమస్కారము చేసినప్పటికిని కేశవునికే నమస్కారము చేసినవారమవుతాము. దానినే ఇంకొక రీతిలో తీసుకున్న 'సర్వజీవ తిరస్కారం కేశవం ప్రతిగచ్ఛతి' ఎవరిని మనము దూషించినా కాని తిరిగి మనం కేశవునే దూషించిన వారమవుతాము. మానవునియొక్క హృదయములో అల్పమైన, సంకుచితమైన భావములు పెట్టుకోవటంచేతనే నాకు ఈ దేవుడే, ఇతను మాత్రమే నా దేవుడు. నేను రాముడిని యిష్టపడతాను, కృష్ణుడిని ఇష్టపడను లేక నేను కృష్ణుడిని ఇష్టపడతాను, రాముడిని ఇష్టపడను అని చెప్పేటువంటివారు ఎలాంటివారు? సంకుచిత హృదయులు. సహస్ర శీర్షములతో ఉన్నటువంటివాడు

sri sathyasai vahini

భగవంతుడు. 'సహస్ర శీర్షా పురుషః సహస్రాక్షః సహస్రపాత్' కాబట్టి ఒక్కొక్క పేరు నీకు ఇష్టంగా ఉండవచ్చును. మరొక పేరు నీవు ద్వేషించకూడదు. అన్ని నామములుకూడను భగవంతునివే. ఒక చిన్న ఉదాహరణము. మనము సహస్రనామార్చనము చేస్తున్నాము. ఈ విధంగా చేసినప్పుడు ఒక్క పుష్పము తీసుకుంటాము. కేశవాయ నమః, నారాయణాయ నమః, మాధవాయ నమః ఇవన్నీ కూడను ఒకే రూపముపైన వేస్తున్నాము కాని నారాయణుడు అంటే ఇంకొక నారాయణుని పటము తీసుకుని వచ్చి, కేశవా అంటే కేశవుని పటము తెచ్చి మనము ఆ విధంగా పూజించటంలేదు. అన్ని నామములూ మనము ఒక్క రూపముతోనే మనము నిరూపిస్తూ వస్తున్నాము. కాబట్టి 'ఏకంసత్ విప్రాః బహుధా వదన్తి' ఈ నామములంతా విప్రులు బోధించినటువంటి వివిధ నామములు. ఇవన్నీ చేరి ఒకే రూపమునకు సంబంధించినటువంటివే. ఒక్క దేహములోపల అనేక అంగములు ఏ విధముగా ఉన్నాయో ఒక్క దైవమునకు అనేక పేర్లు ఉన్నాయి. కాని ఇన్ని పేర్లు ఉన్నప్పటికిని దైవము ఒక్కడే. కృష్ణా అనుకో, రామా అనుకో, అల్లా అనుకో, జీసస్ అనుకో, జోరాష్ట్ర అనుకో, గురు ప్రభో అనుకో ఏ విధంగా అనుకున్నా గాని భగవంతుడు ఒక్కడే. కనుక ఈ పేర్లు వారియొక్క అభిరుచిని పురస్కరించుకుని అభివృద్ధి అవుతూ వచ్చినాయికాని భగవంతునిలో ఎలాంటి భేదములేదు. కనుక మనము సంకుచిత హృదయాన్ని మనము దూరం చేయ్యాలి. నాకు ఫలాన నామమే, ఫలానా రూపమే నాకు అవసరము అనుకుంటే అప్పుడు ఏమైపోయినట్లు? భగవంతుని కొంతవరకు సంకుచితంగా నీవు అనుభవించినట్లు అవుతుంది. ఎవ్వరైన సరే ఏ రూపమైన సరే అందరియందు ఉండినటువంటి దివ్యత్వాన్ని మనము సమత్వంగా తీసుకోవాలి.

**కులమత భేదాలు వద్దు-స్త్రీ పురుష భేదం వద్దు. అందరూ దైవస్వరూపులే**

కనుక ఈ 19వ తేదీ అనే దినమును మీరు ఈ ఏకత్వాన్ని ప్రచారం చేసి అందరియందు ఉండినటువంటి దైవత్వం ఒక్కటే అని ఈ మతములయొక్క భేదమును పోగొట్టాలి. ఈ మతములయొక్క భేదమును దూరము గావించాలి.

నా మతం ఒక్కటే. ఏమిటా మతము? మానవమతము, నాయొక్క కులము ఒక్కటే.

sri sathyasai vahini / sri sathyasai vachanamrutam

ఏమిటీ ఈ కులము. There is only one caste, the caste of humanity; there is only one language, the language of the heart; there is only one religion, the religion of Love. ఈ మూడింటినీ మాత్రం మనము ఏకముగా తీసుకోవాలి. ఇప్పుడు చెప్పాను పంచభూతములు అని చెప్పాను. అంగవతి, సరస్వతి, ఈ అంగవతిలోపల పంచభూతములు చెప్పాను. ఈ పంచభూతములు ఏ ఒక్క మతము ఏ ఒక్క మతమునకు విరుద్ధంగా పోయేటువంటివి కాదు. ఈ పంచభూతములది ఏ కులము? ఏ కులము లేదు. ఆకాశమునకు ఏ కులము? గగనమునకు ఏ కులము? గంగకు ఏ కులము? ఏ కులమూ లేదు. కనుక భూమికి ఏ కులము? నీటికి ఏ కులము? ఏ కులమూ లేదు. ఈ విధముగా పంచభూతములకే కులభేదములు లేనప్పుడు మనము ఎందుకు ఈ కులమతములతో పోరాడాలి? అందరిదీ ఒకే మతమే మానవ మతము. ఈ మానవ మతములోపల మనము ఆదర్శవంతమైనటువంటి అనుగ్రహాన్ని తగినటువంటి రీతిగా అందించాలి. ఈనాడు community అనేటువంటి దానిని మనము అధికముగా పట్టుకుంటున్నాము. ఈనాడు పరిపూర్ణమైనటువంటి ఆత్మతత్త్వము కలిగినటువంటి వారికి unity అవసరము, purity అవసరము, divinity అవసరము. కాని ఈనాడు purity, unity, divinity ని మర్చిపోయినారు. Community and enimity ఈ రెండింటినీ చేతిలో పెట్టుకుని జీవితము గడుపుతున్నారు. ఈ enimity, community అనేవి మనలో ఉన్నప్పుడు అన్ని విధాలా అపజయమే పొందుతాము. భగవంతునకు ఏ కులమతములూ లేవు. ఏ భేదములూ లేవు. అందరికీ తాను దైవమే. ఏ దేశమువారికైనా దైవమే ఏ కాలమునందైనా దైవమే. ప్రాచీన కాలమునందు ఇట్టి భేదములు ఏమాత్రము కలిపించలేదు. వారు పరిపూర్ణ హృదయులుగా ఉండి భారతీయ సంస్కృతిని ఆశ్రయించి, ఆనందం అనుభవిస్తూ వచ్చేటువంటివారు. సంస్కరింప చేసేదే సంస్కృతి. కనుక ఎట్టి భేదమునకూ అవకాశము ఇవ్వకుండా, ఎట్టి కులమతముల భావనలకూ అవకాశము ఇవ్వకుండా, స్త్రీ పురుషులు అనే భేదములేకుండా, దైవత్వములోపల సర్వులూ ఒక్కటే అనే ఏకత్వమునకు రావాలి. ఒకే దైవము. ఈ దైవత్వాన్ని సమత్వముగా మనము పంచుకోవాలి.

**(తేదీ 19-04-1998న భగవాన్ శ్రీ సత్యసాయిబాబావారి దివ్యోపన్యాసము)**

srisathyasaivachanamrutam